పద్మాసనం వేస్కొని, వొళ్ల తంబుర పెట్టుకొని దాని తీగను వేళ్లతో టింగ్‌టింగ్ అనిపిస్తూ.. పెదవులు కదిలిస్తూ ఏదో తత్వం లోపల్లోపల పాడుకుంటుండు.

''అంబబల్కు జగదంబబల్కు! కంచిలున్న కామాక్షి పల్కు! బెజవాడలున్న దుర్గమ్మ పలుకు!'' అని పాడుతూ.. బలిష్టంగా, మెడనిండా దండలతో, ఛాతి పైన పొంగుతున్న కండలతో ఉన్న ఒక బైరాగి కాలిబాట వెంట నడిచొస్తుండు. మెళ్ల రుద్రాక్షమాల, తెల్లటి బవిరి గడ్డం, ఎడమ భుజంమీద జోలె వేలాడుతుంటే.. కుడిచేతిలో తంబుర, చెప్పులు లేని కాళ్లు దుమ్ము కొట్టుకున్నయ్.

అతను ముసలి బైరాగి ఉన్న చెట్టు దగ్గరాగి, చెట్టు నీడల జోలె దించి..

'పొద్దు బారెడు కూడా ఎక్కలేదు. అప్పుడే ఎండ మాడపెడ్తుంది' అని తనలో తను అనుకుంటుంటే..

''మంది ఏ ఊరు సామీ?'' అంటూ మందలించిండు ముసలి బైరాగి.

''మాది అర్వదేశం నాయనా. సొంత దేశం వదిలి పెట్టి ముప్పై ఏళ్లయింది. ఇప్పుడన్నీ నా ఊర్లే. ఏ ఊరు కాడ పొద్దుబోతే ఆ దినానికదే నా ఊరు'' అని తంబురను కళ్లకు అద్దుకున్నడు.

''పెద్దారే నాయనా! వానలు జోరుగబడి చుట్టుపక్కల చెరువులన్నీ నిండిన సంబురం కనబడ్తుంది''.. సంతోషంగా అన్నడు మళ్లీ.

''ఔ మరి! వానలు పడి, సెర్వులు నిండితె.. తోటలు, దొడ్లున్న మారాజులకు లాభం. రోజోచోట కాపురముండే మనసోంటోల్లకేం సంబడం!?''.

''మరి ఊరు సల్లంగుంటేనే గదనే మనకు గింజలు దొరికేది. మన కడుపు నిండేది''.

చిన్న బైరాగి మాటలకు పెద్దాయన విరక్తిగా నవ్వి..

''గవన్నీ ఎన్కటిరోజులు. దేవుని కథలు చెప్పుకొంట, సామెతలు చెప్పుకొంట, తత్వాలు పాడుకుంట నడి రాత్రి నుంచి తెల్లారిందాకా చేతిలో లాంతరు పట్టుకొని, ఇంకో చేత్తో డమరుకం వాయిస్తూ రెండు కాళ్ల సందున గంట గట్టుకొని భుజాన పెద్ద జంపకానతో తిరిగే బుడుబుడుకలోల్లం.. సలిపొద్దుల ఇంటింటి ముందు వాయించినా నిద్రపోకుండా లేపిండని జనాలు ఇసుక్కోకుండా చేటలతో గింజలు పెట్టెటోళ్లు. ఇప్పుడేముందబ్బీ.. ముష్టోల్ల కింద జమ కడ్తుండ్రు!''.



''మీరేమిటోళ్లు కొడ్కా!?'' అడిగిండు ముసలాయన.

''భలేగడ్డినవ్ నాయ్నా! నీదేకులమో నాది గదే!''.

''మనకు కులం యాడిది కొడ్కా!'' బాధగా అన్నడు ముసలి బైరాగి.

''బాధ పడుతున్నవెందుకు నాయ్నా? అయినా.. పచ్చికి, పశువుకు కులముందా? చెరువుల నీళ్లకు, ఇర్రగాసే యెన్నెలకు, సువాసనిచ్చే పూలకు, ఆ వాసనను అంతటికి తోల్కపోయె గాలికి, చెట్టుకు చామకు ఆఖర్కి పాటోలున్న దేవునికి కులముందా? మనకూ గంతే! ఈ నడుమంత్ర పోళ్లకే కులం గావాలె గాని మనకెందుకు?''.

''నువ్వనుకునేదంత తప్పు కొడ్కా!''.

మాసిన నెత్తిని పొడుగాటి గోళ్లతో గోక్కుంటూ..

''కులమంటు ఉండాలె కొడ్కా. మనిషి ముందుగ భూమ్మీదికి అచ్చినప్పుడు కులం లేదు. మతం లేదు. ఇల్లు లేదు. ఊరు లేదు. జంతువు లెక్కే తిరిగేటోళ్లట. రాన్రాను యేండ్లకేండ్లు గడిశినాంక ఒకటొకటి అన్ని సమకూర్నయ్. బూమి, ఎద్దు, ఎగుసాయం, పంట, పాడిగల్గి ఎవరూర్ల వాళ్లు ఉండి పోయిండ్రు. మన సోంటి దేశదిమ్మరి జాతులకు ఈనాటికీ కులం లేదు. స్థలం లేదు. కడుపు నిండ తిండి లేదు. నిజం చెప్పుకొంటె జంతువుకు మనకు తేడెక్కడుంది? కులరుత్తి చేస్కుంటనైన పొట్ట నింపుకోవొచ్చు. గది కూడ మనకు లేదాయె. పాత రోజుల్ల మనల్ను కళాకారులనేటోళ్లు. గౌరవించేటోళ్లు. ఇప్పుడు మనల్ని సూస్తెనే సీదరించుకుంటుండ్రు. నేను పోయినంక ఇప్పుడు తింటున్న ఒంటి పూట అన్నం కూడ నావోల్లకి దొరకదు''.. ముసలి బైరాగి గొంతు వణికింది.

''మన్ది గూడ వృత్తేగద నాయ్న. సత్యవాక్కు చెప్తం. లోకమంతా బాగుండాలని భగమంతున్ని కోరుకుంటం. ప్రతి ఇంట్ల పిల్లపాప సంతోషంగా సుఖంగుండాల్నని మన్సుల ఇసంలేకుండ దీవిస్తం. గింతకన్న గొప్ప రుత్తేముందయ్య!''.

చిన్న బైరాగి మాటలకు పెద్దాయన ఆలోచనలో పడ్డడు. తనకు మాత్రం తన పని మీద గౌరవం లేదా? తత్వాలు పాడకుండ ఏనాడైన గడ్చిందా.

అటు ఇటు గుడిసెలల్ల సిన్నసిన్న పిల్లగాండ్లు ఆకలితో ఆవురావురనుకుంట గిన్నెలు, బొచ్చెలు పట్టుకొని ఊర్ల అడుక్కుందామని పోటిబడి ఉరుకుతుండ్రు.

''మనకు కులం లేకున్న కట్టుబాట్లు ఎక్కువగద కొడ్క. మిగిల్న తెగలు పగటిపూట బిక్షాటన జేస్తె.. మనం నడిరేత్రి ఊర్లకిపొయ్యి, తెల్లారక ముందు విరమించెటోళ్లం. పొద్దు పొడిస్తె వీధుల మొకం చూడొద్దనేది మన ఆశారం. మనం తిరిగే ఊళ్లల్ల చెడు జరుగొద్దని గౌరికట్టు కట్టెటోళ్లం. పసిపిల్లగాండ్లకు దోసాలు రావద్దని తాయత్తులు కట్టెటోళ్లం. సాట నిండుగ గింజలు పెట్టకపోతే తీసుకోకపోదుము. అంటే.. కొట్లాడి తీసుకునేటోళ్లం. వాళ్లిచ్చే గింజలు, బట్టలు నచ్చకుంటే హక్కు తీర్గ అల్గెటోళ్లం. ప్రతింటోళ్లు తమ ఇంటిమనిషి లెక్క చూస్కునెటోళ్లు. ఇప్పుడు అవన్ని పోయ్నయ్. పది రూపాలిచ్చినా,